క్లుప్తంగా

ట్రాన్స్‌కో డీఈ బదిలీ

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో రూరల్–3 సబ్‌డివిజన్ డీఈ పద్మనాభపిళ్లెను బదిలీ చేస్తూ సీఎండీ సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. కార్పొరేట్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఆయన స్థానంలో ఎస్‌పీఎం డీఈ ఆనంద్‌ను నియమించారు. త్వరలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో ఈయన సబ్‌డివిజన్ పరిధిలో ఏఈగా పనిచేశారు.

బొమ్మసముద్రం జూనియర్ కళాశాల స్వర్ణోత్సవం రేపు

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం జూనియర్ కళాశాలలో శుక్రవారం ఉదయం 10 గంటలకు స్వర్ణోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ శరత్‌చంద్రశేఖర్ తెలిపారు. 1974లో ఇదే ప్రాంతానికి చెందిన కేఎం రెడ్డి ఇక్కడ కళాశాలను ఏర్పాటు చేశారు. 2024కు 50 ఏళ్లు పూర్తి కావస్తున్న తరుణంలో గోల్డెన్ జూబ్లీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఇంటర్‌మీడియెట్ విద్యాశాఖాధికారి సయ్యద్ మౌలా పాల్గొంటారని తెలియజేశారు.

విద్యుత్ గ్రీవెన్స్‌కు 4 సమస్యలు


వినియోగదారులతో మాట్లాడుతున్న ఈఈ

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయంలో బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల వినియోగదారులు సమస్యలు నివేదించారు. తమ దృష్టికి వచ్చిన నాలుగు సమస్యల్లో ఒకటి పరిష్కరించామని, మిగిలినవి ఆర్థికపరమైన సమస్యలతో ముడిపడి ఉన్నాయని, వాటికి అనుమతులు రాగానే పరిష్కరిస్తామని ఈఈ మునిచంద్ర తెలిపారు. కార్యక్రమంలో డీఈ శేషాద్రి, ఏఈలు కేశవచంద్ర, మాధురి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు నోటీసులు


నోటీసులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

గుడిపాల: ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ఫస్ట్ ఎయిడ్ చేయడం తప్పితే ఇంజెక్షన్లు వేయరాదని, ఫలాన మందులు వేసుకోవాలని ప్రిస్క్రిప్షన్ రాసివ్వరాదని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి చంద్రమహేష్ స్పష్టం చేశారు. పీహెచ్‌సీ పరిధిలోని ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లకు నోటీసులు అందజేసి ఆయన మాట్లాడారు. ఆయా క్లినిక్స్ వచ్చే రోగులకు రక్తపరీక్షలు కూడా చేయరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా శిక్షార్హులవుతారని హెచ్చరించారు. వైద్యసిబ్బంది జబసెల్వి, చంద్రశేఖర్, విజయ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ పరిధిలోని కొత్తపల్లెమిట్ట సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఈఈ మునిచంద్ర తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు జీడీనెల్లూరు, పాలసముద్రం వాటి చుట్టుపక్కల ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు.

ఉండ్రాలయ్యా.. దండాలయ్యా..!


చిత్తూరులో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు


బంగారుపాళెం: పాలేరులో నిమజ్జనానికి తరలిస్తున్న వినాయకస్వామి విగ్రహం


ఐరాల: వీఎస్ అగ్రహారంలో..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో పలు చోట్ల వినాయక నిమజ్జనం అట్టహాసంగా నిర్వహించారు. వాడవాడలా కొలువుదీరిన గణపతి ప్రతిమలు విశేషపూజలున్న అనంతరం ఆయా వీధుల్లో మహిళలు మంగళ హారతి పట్టి..నైవేద్యం సమర్పించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. తర్వాత డప్పువాయిద్యాల హోరు, బాణసంచా మోత నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి కట్టమంచి చెరువులో నిమజ్జనం చేశారు. క్రేన్ సాయంతో వినాయకుని ప్రతిమలను చెరువులోకి దింపి నిమజ్జన ప్రక్రియను ప్రశాంతంగా ముగించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

బంగారుపాళెం మండలంలో..

బంగారుపాళెం: మండలంలోని పాలేరు, బంగారుపాళెం, తగ్గువారిపల్లె తదితర గ్రామాల్లో బుధవారం కోలాహలంగా వినాయకుని నిమజ్జనం నిర్వహించారు. గ్రామాల్లో వినాయక ప్రతిమలకు ఐదురోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉట్లతిరునాళ్లను నిర్వహించారు. యువకులు నువ్వా, నేనా? అనే లెవెల్లో ఉట్టి కొట్టేందుకు పోటీ పడ్డారు. ఉట్టి అనంతరం వినాయకుని ప్రతిమలను మేళతాళాలు, బాణసంచా వేడుకలు మధ్య నిమజ్జనానికి తరలించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐరాల మండలంలో..

ఐరాల: స్థానిక వీ.ఎస్.అగ్రహారంలో ఐదురోజులుగా చవితి పూజలు అందుకున్న వినాయకుడి ప్రతిమను బుధవారం రాత్రి కోలాహలంగా నిమజ్జనం చేశారు. సాయంత్రం గణపయ్యను ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగింపుగా తరలించారు. గణపయ్యకు భక్తులు కొబ్బరికాయలు కొట్టి, హారతులు సమర్పించారు. సాయంత్రం 7 గంటలకు బయలుదేరిన గణనాథుడిని రాత్రి 10 గంటల సమయంలో సమీపంలోని చెరువులో యువకులు నిమజ్జనం చేశారు.


ఊరేగింపుగా వెళుతున్న వినాయకుడు


చిత్తూరు కట్టమంచి చెరువు వద్ద పూజలు




వినాయకుని నిమజ్జన దృశ్యాలు

వేలంలో రూ.2లక్షలు పలికిన లడ్డు!

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం బజారువీధిలో కొలువుదీరిన విఘ్నేశ్వరుడి చేతిలోని లడ్డును బుధవారం వేలం వేశారు. పోటాపోటీగా సాగిన వేలం పాటలో రూ. 2 లక్షలకు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ లడ్డును దక్కించుకున్నారు. అనంతరం నిమజ్జన వేడుకలను అట్టహాసంగా ప్రారంభించారు.

చిత్తూరు ప్రెస్ క్లబ్ కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రమేష్‌బాబు, ఉపాధ్యక్షులుగా శివప్రసాద్, పవన్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా కాళేశ్వర రెడ్డి, సహాయ కార్యదర్శులుగా దొరస్వామి, నవీన్‌కుమార్, కోశాధికారిగా అనిల్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా బాలసుందరం, అయ్యప్పనాయుడు, సీపీ రావు, శివ, రాజేష్, చంద్ర ప్రకాష్, చంద్రశేఖర్, రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన శ్రీనివాసమూర్తి, సుభాష్‌బాబు తెలిపారు. అనంతరం చిత్తూరు ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో లోకనాథం, అశోక్, అభి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం


కలెక్టర్‌కు చెక్కు ఇస్తున్న దాత

చిత్తూరు కలెక్టరేట్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం పుంగనూరుకు చెందిన రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమీ నిర్వాహకులు సి.మోహన్‌రెడ్డి రూ.25 వేల చెక్కును బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీకి అందజేశారు.

అభివృద్ధి పనులపై జెడ్పీ సీఈఓ సమీక్ష


తవణంపల్లె: మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ గ్లోరియా

తవణంపల్లె: మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జెడ్పీ సీఈఓ గ్లోరియా ఎంపీడీఓను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు అభివృద్ధి పనుల గురించి ఆరా తీశారు. గత ప్రభుత్వంలో చేపట్టిన పనులు, ప్రస్తుతం జరుగుతున్న పనులపై సమీక్షించారు. అభివృద్ధి పనులకు సంబంధించి పలు రికార్డులను పరిశీలించి సూచనలు–సలహాలు ఇచ్చారు. ప్రభుత్వ నిబంధనల మేరకే నిధులను వ్యయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఏఓ రెడ్డిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పూతలపట్టు మండలంలో..

పూతలపట్టు: స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని బుధవారం జెడ్పీ సీఈఓ గ్లోరియా ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించిన అనంతరం సిబ్బందితో సమీక్షించారు. మండలంలోని పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ ధనలక్ష్మిని ఆదేశించారు. ఆయా పంచాయతీల్లో చెత్తాచెదారం లేకుండా కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. సచివాలయాల్లో రైతులు, ప్రజలు నివేదించే సమస్యలపై పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహించరాదన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం

తవణంపల్లె: పిల్లల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీలకమైనదని ఎంఈఓ త్యాగరాజులరెడ్డి అన్నారు. మండలంలోని తెల్లగుండ్లపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కె.భువనేశ్వర్‌రెడ్డిని బుధవారం హెచ్‌ఎం మునస్వామి ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా ఎంఈఓ మాట్లాడారు. అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు మరింత ఉత్సాహంతో విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులకు మెరుగైన విద్యనందివ్వాలని టీచర్లకు సూచించారు. విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందివ్వడమే ధ్యేయంగా విద్యాబోధన చేయాలన్నారు. కార్యక్రమంలో నోబెల్ అసోసియేషన్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

- తర్ల్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ కల్పన శైల


పిల్లలతో మాట్లాడుతున్న కల్పన శైల

బంగారుపాళెం: ప్రాథమిక పాఠశాల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని తర్ల్(టీచింగ్ ఎట్ ద రైట్ లెవల్)రాష్ట్ర కో–ఆర్డినేటర్ కల్పన శైల అన్నారు. మండలంలోని గుండ్లకట్టమంచి ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. పిల్లలు అందరూ యూనిఫాంతో పాఠశాలకు హాజరు కావడంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. పిల్లలను పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు. ఆమె మాట్లాడుతూ, ప్రాథమిక స్థాయిలో పిల్లలకు చక్కగా అర్థమయ్యేలా చదువు నేర్పించడమే తర్ల్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. పిల్లల్లో నైపుణ్యాలు గుర్తించి, దానికి తగ్గట్టు వారిని తీర్చిదిద్దాలని సూచించారు. తర్ల్ కార్యక్రమాన్ని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో అమలు చేసి విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందించడానికి ఉపయోగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్ఓ నరోత్తమ రెడ్డి, జీసీడీఓ ఇంద్రాణి, ఎంఈఓ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు




అల్పాహారం పంపిణీ చేస్తున్న హరిణిరెడ్డి, అన్నదానం చేస్తున్న కిషోర్‌కుమార్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి జన్మదినం పురస్కరించుకుని బుధవారం స్థానిక 5వ డివిజన్ కార్పొరేటర్ హరిణిరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. రాస్ వృద్ధాశ్రమంలో వృద్ధులతో కలిసి కేక్‌కట్ చేశారు. వారికి అల్పాహారం అందజేశారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని బుధవారం బంగారుపాళెంలో జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కేక్ కట్ చేసి పంచి పెట్టారు.అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మణిరాజ్, గోపి, జశ్వంత్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వద్దు


హౌసింగ్ ఏఈతో మాట్లాడుతున్న పీడీ పద్మనాభం

పూతలపట్టు: అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని జిల్లా హౌసింగ్ పీడీ పద్మనాభం అన్నారు. బుధవారం మండలంలోని పూతలపట్టు హౌసింగ్ లేఔట్‌ని ఆయన పరిశీలించారు. లేఔట్లలో హౌసింగ్ నిర్మాణ పనులు వేగవంతం కాలేదని, అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తీరు మారకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. హౌసింగ్ ఏఈ కి సూచించారు. లబ్ధిదారులతో మాట్లాడి పనులను వేగవంతం చేయాలని ఏఈని ఆదేశించారు.

దారి సమస్య పరిష్కరిస్తాం


సుధాకర్‌నాయుడుకు నిమ్మరసం ఇచ్చి నిరాహార దీక్షను విరమింపజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఐరాల: పొలాలకు వెళ్లే దారి సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో పరిష్కరిస్తామని తహసీల్దార్ మహేష్‌కుమార్ హామీ ఇచ్చారు. మండలంలోని కామినాయనపల్లెలో పొలాలకు వెళ్లే దారిని కొంతమంది మూసివేశారని బాధిత రైతు సుధాకర్‌నాయుడు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరహారదీక్ష చేయడం విదితమే. దీనిపై స్పందించిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి, నేతలు ప్రభాకర్‌రెడ్డి, చిన్నారెడ్డి, యోగనంద రెడ్డి సుధాకర్‌నాయుడు అతడిని పరామర్శించారు. నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. అనంతరం తహసీల్దార్‌తో చర్చించి దారి సమస్యను పరిష్కరించాలని కోరారు. తదనంతరం తహసీల్దార్ బాధిత రైతుతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో భూములను, కాలువలను పరిశీలిస్తామని పైవిధంగా హామీ ఇచ్చారు. బాధిత రైతు సుధాకర్‌నాయుడు, కుటుంబ సభ్యులకు నిమ్మరసం ఇచ్చి నిరాహారదీక్షను విరమింపజేశారు.

ప్రకృతి వ్యవసాయ విధానాలపై అవగాహన


కల్లూరుపల్లెలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

బంగారుపాళెం: ప్రకృతి వ్యవసాయ విధానాలపై వ్యవసాయశాఖ సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని జిల్లా వనరుల కేంద్రం అధికారి నాగపద్మిని అన్నారు. జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రకృతి వ్యవసాయ విధానాలపై జిల్లాలోని వ్యవసాయశాఖ సిబ్బంది, డీడీఏ, ఏడీఏ, ఏఓలు, డీపీఎంయూ సిబ్బందికి పునశ్చరణ, అలాగే మండలంలోని కల్లూరుపల్లెలో క్షేత్రస్థాయి పర్యటన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. ఘన, ద్రవ జీవామృతం, సీడ్ పెల్లటైజేషన్ గురించి ప్రదర్శనపూర్వకంగా తెలియజేశారు. అనంతరం నాగపద్మిని మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల వైపు రైతులు మొగ్గుచూపేలా వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవం.. నృత్య సమ్మోహనం

కాణిపాకం: వరసిద్ధి వినాయకుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం దేవస్థానం ఆస్థాన మండపంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కూచిపూడి, భరతనాట్యంతో కళాకారులు మంత్రముగ్ధుల్ని చేశారు. ఉదయం కోదండరామస్వామి ధార్మికోపన్యాసమిచ్చారు. కోదండయ్య, తిరుపతికి చెందిన మౌనిక భక్తిగీతాలు ఆలపించారు. తిరుపతికి చెందిన శిల్పారామ బృందం, ఉమశ్రీ, వినాయక విద్యామందిర్, భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు చూపరులను కట్టిపడేశాయి. భగవాన్ సత్యసాయి నాటకోత్సవ సమితి, నెల్లూరు చెన్నకేశవ నాట్యమండలి పౌరాణిక నాటక ప్రదర్శన, కోలాటాలు, భజనలు, లంబాడీ నృత్యాలతో మండపం కళకళలాడింది. కళాకారులను అధికారులు సత్కరించారు.



చిన్నారుల గీతాలాపన


నృత్య ప్రదర్శనలో కళాకారిణి




ఊరేగింపులో కోలాట బృందాల ప్రదర్శన

మరకాల కుప్పంలో 'ఫ్యామిలీ డాక్టర్'




గుడిపాల: రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రష్మిత, తవణంపల్లె: కొండరాజు కాలువలో..

గుడిపాల: మండలంలోని మరకాలకుప్పంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. బొమ్మసముద్రం పీహెచ్‌సీ డాక్టర్ రష్మిత రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో ఇళ్లకే పరిమితమైన రోగుల వద్దకు వెళ్లి వారి ఆరోగ్యం ఎలా ఉందో పరీక్షించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రీలక్ష్మి, యమున, రాధ, దేవప్రీత పాల్గొన్నారు.

కొండరాజు కాలువ, వెంగంపల్లెలో..

తవణంపల్లె: గర్భిణులు రక్తహీనత బారిన పడకుండా పౌష్టికాహారం తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక అన్నారు. బుధవారం మండలంలోని కొండరాజుకాలువలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసి మాట్లాడారు. వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే, వెంగంపల్లెలో ఇదే కార్యక్రమాన్ని డాక్టర్ మోహన్ వేలు నిర్వహించారు. వైద్య సిబ్బంది, హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.